# నిరాశ

— శ్యామలదేవి దశిక, North Brunswick, NJ

జానకమ్మగారికి ఎక్కడా కాలు నిలవటం లేదు. ఆవిడ మనసు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నది. విదేశాల్లో ఉన్న ఒక్కగానొక్క కొడుకు కుటుంబంతో సహా త్వరలో ఇండియా రాబోతున్నాడని ఈ రోజే తెలిసింది. కొడుకును చూడబోతున్న సంబరంలో ఆవిడ కాలు, చేయి ఆడటం లేదు. పొద్దుటి నుంచి ఏపని సరిగ్గా చేయలేక పోతున్నారు. ఉదయం జానకమ్మ గారి భర్త రావుగారు భోజనానికి కూర్చుని పచ్చడి కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకోగానే మొహం అదోలా పెట్టారు. జానకమ్మగారు వెంటనే "ఏమిటండీ పచ్చడి బాగాలేదా, కారం తక్కువైందా" అని అడిగారు. రావుగారు "జానకీ, కొడుకును చూడబోతున్నానని నీకు అంత సంతోషంగా ఉంటే ఒక గ్లాసెడు పరవాన్నం చేసి ఇస్తే తాగి నేనూ సంతోషిద్దును కదా, పచ్చడిలో ఉప్పుకు బదులు పంచదార వేసి ఇలా నన్ను ఇరకాటంలో పెట్టకపోతే" అంటూ వేళాకోళం ఆడారు.

జానకమ్మ గారికి వయసు 60 దాటినా ముఖం మీద చక్కని చిరునవ్వుతో మనిషి ఎప్పుడు ఉత్సాహంగా ఉంటారు. ఆవిడకు క్రొత్తవిషయాలు తెలుసుకోవడం అన్నా, క్రొత్త మనుష్యుల్ని కలుసుకోవడం అన్నా, క్రొత్త క్రొత్త వంటలు నేర్చుకోవడం అన్నా మహా సరదా. రావుగారు సర్వీసులో ఉన్నప్పుడు ఉద్యోగరిత్యా ఎన్నో ఊళ్ళకు ట్రాన్స్ఫర్లు అవుతుండేవి. ఇలా ట్రాన్స్ఫర్లు వచ్చినప్పుడల్లా భర్త, పిల్లలు విసుక్కుంటూ ఉంటే, జానకమ్మగారు మాత్రం చాలా సంతోషంగా బయలు దేరేవారు. ఏ రాష్ట్రం వెళ్ళినా అక్కడి భాషను, పద్ధతుల్ని ఇట్టే నేర్చేసుకునేవారు. రావుగారు, పిల్లలు ఎక్కడ ఉంటే అక్కడి భాషలో నాలుగుమాటలు ముక్కున పట్టి, దానికి ఇంగ్లీషు జోడించి ఎలాగో నెట్టుకొస్తూ ఉండేవారు. కానీ జానకమ్మ గారు మాత్రం నెల తిరక్కుండానే అక్కడి భాషే కాకుండా, పాలవాడితో ఎలా మాట్లాడాలో, పచారి షాపులో ఎలా మాట్లాడాలో కూడా నేర్చేసుకునేవారు. అందుకే రావుగారు షాపింగుకు వెళ్ళాలన్నా, పిల్లలు సినిమాకు వెళ్ళాలన్నా జానకమ్మ గారిని వెంట పెట్టుకొనేవారు. శని, ఆది వారాలు వస్తే భోజనంలోకి రకరకాల స్పెషల్సు చేసేవారు. జానకమ్మ గారి తెలివితేటల్ని, చురుకుదనాన్ని చూసి రావుగారు "జానకీ, నిన్ను ఐదో తరగతి చదువుతోనే ఆపేయించి మీవాళ్ళు పెద్ద తప్పు చేసారోయి!" అంటూ హాస్య మాడుతూ ఉంటారు.

ప్రస్తుతం జానకమ్మగారి మనసంతా ఇంకా కొద్దిరోజుల్లో రాబోతున్న కొడుకు, కోడలు, ముద్దుల మనవరాలి చుట్టే తిరుగుతోంది. వాళ్ళు ఇక్కడ ఉన్నప్పుడు ఏమేమిచేయాలో అప్పుడే ప్లాన్లు వేసుకోవడం మొదలుపెట్టారు. కొడుకుకు ఇష్టమైనవన్నీ చేసిపెట్టడంతో పాటు, కోడలిదగ్గరనుంచి ఇంగ్లీషు పిండివంటలు నేర్చుకోవాలనుకుంటున్నారు. జానకమ్మగారి కోడలు ఇండియాలో ఉన్నప్పుడు ఇంటికి ఎవరైనా అనుకోకుండా గెస్టులు వస్తే చిటికలో స్వీటు, హాటు సృష్టించేది. అమెరికావెళ్ళి ఇంకెన్ని నేర్చుకుందో ఆ కేకులు, పుడ్డింగులు అవన్నీ ఎలాచేయాలో నేర్చుకోవాలి కోడలి దగ్గరనుంచి అని జానకమ్మగారు చాలా ఆతృత పడుతున్నారు. ఇంక మనుమరాలు సరేసరి! చిట్టితల్లి ఇక్కడ ఉన్నప్పుడు ఎన్నికబుర్లు చెప్పేదో. మూడేళ్ళ వయసుకే అటు నర్సరీస్కూల్లో నేర్చుకున్న ఇంగ్లీషు పాటలు, పద్యాలు, ఇటు ఇంట్లో జానకమ్మగారు నేర్పిన బుల్లిపద్యాలు, చిన్నిచిన్ని శ్లోకాలు, పాటలు ముద్దొచ్చేటట్లు చెప్పేది. మరి ఇప్పుడు అమెరికా దేశంలో పెరుగుతూ ఎన్ని కొత్తపద్యాలు, పాటలు ఇంకెన్ని భాషల్లో వినిపిస్తుందో, అవన్నీ వినటానికి జానకమ్మగారి మనసు ఉవ్విళ్ళూరుతున్నది.

ఎదురుచూసినంతసేపు పట్టలేదు. జానకమ్మగారి కొడుకు కుటుంబంతోసహా రావడం తిరిగి అమెరికా వెళ్ళిపోవడం అంతాజరిగిపోయింది. ఆవిడ వాళ్ళు రాకముందు అనుకున్నవాటిలో ఒక్కటీ జరగలేదు. జానకమ్మగారికి పిల్లల్ని చూసానన్న సంతృప్తి, వాళ్ళు ఉన్నన్ని రోజులు సరదాగా గడిచాయన్న ఆనందం కలిగినా ఎక్కడో మారుమూల ఆవిడ మనసులో వెలితిగానేఉంది. కొడుకుకు ఇష్టమని జానకమ్మగారు బోలెడు రకాలు చేసారు. అన్నీ కొద్దిగా రుచిచూసి వదిలేసాడే తప్ప పూర్వంలా ఇష్టంగా తినలేదు. జానకమ్మగారు చూసిచూసి "ఇదేమిటిరా ఇవన్నీ నీకు ఇష్టమని చేసాను" అంటే ఇందులో నూనె ఎక్కువ, ఇందులో ఉప్పు, కారం వంటికి మంచిది కాదు, దీంట్లో ఫాట్ కంటెన్ట్ ఎక్కువ వుంటుంది, దీన్నే కొలెస్ట్రాల్ అంటారు అంటూ ఏమిటేమిటో చెప్పాడు.

ఒకరోజు కొడుకు కాస్త తీరుబడిగా ఉండటంచూసి మిసెస్ అగర్వాలా ఇంటికి తీసుకువెళ్ళారు జానకమ్మగారు. జానకమ్మగారువాళ్ళు ఢిల్లీలో ఉన్నప్పుడు పక్కింట్లో ఉంటున్న అగర్వాలా కుటుంబం ఎంతో స్నేహంగా ఉండేవారు.జానకమ్మగారి కొడుకు వాళ్ళ అబ్బాయిలతో ఎక్కువ భాగం వాళ్ళింట్లోనే గడిపేవాడు.ఎప్పుడైనా అకస్మాత్తుగా పెళ్ళిళ్ళని, పేరంటాలని ప్రమాణాలు చేయాల్సివచ్చినప్పుడల్లా కొడుకు చదువు పాడవకుండా మిసెస్ అగర్వాలా మీ అబ్బాయిని మేము చూసుకుంటాం, ఏం భయం లేదు వెళ్ళిరండి అంటూ పంపించేవారు. జానకమ్మగారి కొడుకును చూసి ఆవిడ బోలెడు సంబరపడిపోయి గలగలా మాట్లాడుతుంటే జానకమ్మగారి కొడుకు బిక్కమొహం వేసుకొని తల్లివైపు చూడ్డం మొదలుపెట్టాడు.జానకమ్మగారు నీకు హిందీ సుబ్బరంగా వచ్చుగదురా అంటే ఇప్పుడు అంతా మర్చిపోయాను పొమ్మన్నాడు.

కోడలు వచ్చినప్పటినించి షాపింగని, అదని, ఇదని ఎప్పుడూ హడావిడిగానే ఉంది. జానకమ్మగారు ఇంక చివరకు ఒకరోజు కోడల్ని అడిగేసారు అక్కడ కేకులు, పిండివంటలు ఎలా చేస్తారో ఒకటి, రెండు చూపించమని. జానకమ్మగారి కోడలు "అవన్నీ నాకు రావు అత్తయ్యగారు, ఇలాంటివన్నీ అక్కడ షాపుల్లో చాలా చౌకగా అమ్ముతారు ఎప్పుడు కావాలంటే అప్పుడు కొనుక్కోవచ్చు, పైగా ఇవి వంటికి మంచిది కాదని మీ అబ్బాయి తినడం తగ్గించేసారు అందుకే మన స్వీట్లు కూడా చెయ్యడం మానేసాను" అంది. ఇంక ముద్దుల మనవరాలు సరేసరి, చిన్నప్పుడు జానకమ్మగారి వడిలోనుంచి దిగేదికాదు. ఇప్పుడు దగ్గరకు రమ్మని ఎంతపిలిచినా రాలేదు. మనవరాలిని మాలిమి చేసుకునేటప్పటికి తాతలు దిగొచ్చారు. కాస్త అలవాటు పడే టైముకు వాళ్ళు వెళ్ళేపోయారు. మాట్లాడిన కాసేపు ఆ ఇంగ్లీషులోనే ఏదో గొణిగింది. జానకమ్మగారు "ఇదేమిటిరా ఇక్కడ ఉన్నప్పుడు చక్కగా తెలుగు కూడా మాట్లాడేదికదురా" అంటే దానికి వాళ్ళ అబ్బాయి అక్కడ పిల్లలు అందరూ అంతేనమ్మా, అమెరికాలో పెరిగేవాళ్ళకు తెలుగుతో పనేముంది అంటూ సమర్థించాడు.

చాలా విషయాల్లో సరేలే అని సరిపెట్టుకొని అర్థం చేసుకొన్నారు. కానీ, ఒక విషయం మాత్రం జానకమ్మగారిని బుర్ర ఎంత బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. ఇండియాలో పుట్టి పెరిగి మూడు భాషలు మాట్లాడగలిగే కొడుకు ఇంకా పై చదువులకోసం అమెరికా వెళ్ళి ఇప్పుడు రెండే భాషలు మాట్లాడుతున్నాడు ఇండియాలో పుట్టి రెండు భాషలు మాట్లాడగలిగిన మనవరాలు అమెరికాలో పెరుగుతూ ఇప్పుడు ఒక్క భాషే మాట్లాడుతోంది. మరి ఐదోతరగతితో ఆపేసి ఏ దేశము వెళ్ళకుండా ఐదు భాషలు అవలీలగా మాట్లాడగలిగిన జానకమ్మగారికి ఊ కీలకం ఏమిటో ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. ఉన్న దేశంలోనే ఇక్కడా, అక్కడా తిరిగి ఎన్నో నేర్చుమని, దేశం వదిలి మరో గొప్ప దేశం వెళ్ళి వచ్చిన కొడుకు కుటుంబం దగ్గరనుంచి ఇంకా ఎన్నో నేర్చుకోవచ్చని అనుకున్న జానకమ్మగారికి మిగిలింది (గొప్ప) నిరాశే అయింది పాపం! ******